క్లుప్తంగా

మాదిగ అమరవీరులకు ఘన నివాళి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎస్సీ కాలనీ యువకులు

రాజవొమ్మంగి: దాదాపు 30 ఏళ్లలో ఎంఆర్‌పీఎస్ పోరాటాల్లో అసువులు బాసిన అమరవీరులకు శనివారం స్థానిక ఎస్సీ కాలనీ యువకులు ఘన నివాళులు అర్పించారు. ఎంఆర్‌పీఎస్ అల్లూరి జిల్లా అధ్యక్షుడు మూర్తి బుజ్జి ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం వారు చేసిన ప్రాణ త్యాగం మరువలేనిదన్నారు. నూకరాజు, అనిల్, దుర్గాప్రసాద్, చిన్న, ప్రశాంత్, మధు పాల్గొన్నారు.

వర్గీకరణ పోరు వీరుల త్యాగం మరువలేనిది

గంగవరం: మాదిగల ఏబీసీడీ వర్గీకరణ పోరు వీరుల త్యాగం మరువలేనిదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నిడమర్తి చిన్నబాబు అన్నారు. గంగవరం మండలం రాజవరంలో శనివారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులతో కలసి నిర్వహించిన గాంధీభవన్ ముట్టడిలో పోలీసు కాల్పుల కారణంగా చనిపోయిన అమరవీరులకు నివాళులర్పించారు. ఆనాటి వారి ప్రాణత్యాగం నేడు మాదిగ సమాజం యావత్తు ఫలాలను అనుభవిస్తుందన్నారు.

జడ్డంగిలో అన్నదానం



జడ్డంగి శివాలయం వద్ద అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి అటవీ ప్రాంతంలోని భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకొని, ఇక్కడ తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని నాలుగు రోజులుగా ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం జరిగిన అన్నదాన కార్యక్రమానికి మండలానికి చెందిన ఆద్య రమేష్ విరాళం ఇచ్చినట్లు సభ్యులు తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



పరీక్ష సామగ్రి అందిస్తున్న సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ ఓసీ వినాయక్

జి.మాడుగుల: ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు లక్ష్య సాధనపై దృష్టి సారించాలని, 10వ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలని నుర్మతి అవుట్ పోస్టు పోలీస్ స్టేషన్ 198 బెటాలియన్ ఓసీ వినాయక్ ఆకాంక్షించారు. మండలంలో నుర్మతి అవుట్‌పోస్టు పోలీస్ స్టేషన్, పోలీస్ శాఖ పరిధిలో శనివారం నుర్మతి, బొయితిలి ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పరీక్ష సామగ్రిని ఆయన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆశ్రమాల్లో కల్పిస్తున్న సదుపాయాలు, ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతపల్లిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



చింతపల్లి డిగ్రీ కళాశాలలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

చింతపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్యులు పరీక్షలు చేసి, అవసరమైన వారికి కంటి అద్దాలను సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభారతి, నిర్వాహకులు చంద్రశేఖర్, అధ్యాపకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

దుంబ్రిగుడ: అరమ పంచాయతీ కేంద్రంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నామని ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ తెలిపారు. ఈ శిబిరంలో వైద్య నిపుణులు పాల్గొని పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. గిరిజనులు పాల్గొని ఉన్నత వైద్యం పొందాలని ఆయన కోరారు.



గూడెంకొత్తవీధి గురుకుల కళాశాలలో పరిశీలిస్తున్న తహసీల్దారు రామకృష్ణ, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు



పరీక్షలు రాసేందుకు వెళ్తున్న దుంబ్రిగుడ కళాశాల విద్యార్థులు



వి.ఆర్.పురం జూనియర్ కళాశాలలో బందోబస్తు పర్యవేక్షిస్తున్న ఎస్‌ఐ సంతోష్ కుమార్



అడ్డతీగల జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సీఐ నరసింహమూర్తి

ఇంటర్ పరీక్షల సందడి

కూనవరం: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. కూనవరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంగా ఐదు కళాశాలలకు చెందిన 248 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా.. 29 మంది గైర్హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ రామచంద్ర మూర్తి తెలిపారు. ఏపీటీడబ్ల్యూఆర్ గురుకుల జూనియర్ కళాశాలకు చెందిన 121 మంది విద్యార్థులు, కేజీబీవీకి చెందిన 35 మంది విద్యార్థులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 46 మంది విద్యార్థులు, ఎటపాక కేజీబీవీ, నెల్లిపాక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మొత్తం 248 మందికి 219 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాన్ని చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా సందర్శించారు. పరీక్షలు సంబంధించి డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా ఐ.విద్యాసాగర్ వ్యవహరించారు.

గురుకుల జూనియర్ కళాశాలలో 18 మంది గైర్హాజరు

రాజవొమ్మంగి: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాల కేంద్రంగా శనివారం ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో మొదలయ్యాయి. తొలిరోజు ఇంటర్ ప్రథమ సంవత్సరానికి చెందిన తెలుగు పేపర్‌-1, ఒకేషనల్ కోర్సు పరీక్షలు జరిగాయి. మొత్తం 333 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 18 మంది గైర్హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ జి.సంతోషి కుమారి తెలిపారు. వీరిలో 17 మంది జనరల్ సబ్జెక్టుకు చెందిన వారు, ఒకరు ఒకేషనల్ కోర్సుకు చెందిన వారు. ఈ పరీక్షా కేంద్రంలో గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలకు చెందిన 132 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 144 మంది విద్యార్థులు, స్థానిక జెట్పీ టెన్ ప్లస్ స్కూల్‌కు చెందిన 17 మంది పరీక్షలు రాశారు. మరో 23 మంది ప్రయివేటు విద్యార్థులు, 17 మంది ఒకేషనల్ కోర్సులకు చెందిన వారు కూడా ఈ కేంద్రంలో పరీక్షలు రాశారు.



పరీక్షల అనంతరం బయటకు వస్తున్న దుంబ్రిగుడ కేజీబీవీ విద్యార్థులు



జి.మాడుగులలో పరీక్ష కేంద్రానికి వెళుతున్న విద్యార్థులు

ఇంటర్ పరీక్ష కేంద్రాల తనిఖీ

గూడెం కొత్తవీధి: గూడెం కొత్తవీధి మండల కేంద్రంలోని ఏపీ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని శనివారం తహసీల్దారు రామకృష్ణ, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలో సదుపాయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ అప్పలసూరి పాల్గొన్నారు.

మొదటి రోజు 105 మంది గైర్హాజర్

అడ్డతీగల: ఇంటర్మీడియెట్ పరీక్షలకు మొదటి రోజు అడ్డతీగలలోని రెండు పరీక్ష కేంద్రాల్లో 105 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 312 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 226 మంది మాత్రమే పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ రాజేంద్రస్వామి చెప్పారు. 86 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజర్ అయ్యారన్నారు. గురుకుల జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రానికి 266 మంది పరీక్ష రాయవలసి ఉండగా.. 247 మంది హాజరయ్యారు. 19 మంది విద్యార్థులు పరీక్ష రాయలేదు. రెండు పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు అక్కడి పరిస్థితిని అడ్డతీగల సీఐ నరసింహమూర్తి పర్యవేక్షించారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి పరీక్షా కేంద్రాల్లోకి పంపించారు.

దుంబ్రిగుడ: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియార్ కళాశాల నుంచి 212 మంది, కేజీబీవీ నుంచి 39 మంది విద్యార్థులు మొత్తం 251 మంది హాజరుకాల్సి ఉండగా.. 14 మంది గైర్హాజరయ్యారు.

జి.మాడుగుల: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. మండలంలోని గురుకులం కళాశాల, కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. 436 విద్యార్థులకు గాను 379 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 57 మంది గైర్హాజరయ్యారు.

కొయ్యూరు: కాకరపాడు గురుకుల జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఇంటర్ మొదటి ఇంటర్ పరీక్షలకు 19 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. గురుకుల కళాశాల, కస్తూర్బా గాంధీ, కొయ్యూరు ప్రభుత్వ కళాశాలలకు చెందిన 179 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా.. గురుకుల కళాశాలకు చెందిన 16 మంది, కేజీబీవీ నుంచి ఒకరు, ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఇద్దరు గైర్హాజరయ్యారని డీవో అప్పారావు, ప్రిన్సిపాల్ జగన్నాథరావు తెలిపారు.

వి.ఆర్.పురం: స్థానిక జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 93 మంది విద్యార్థులకు గాను 81 మంది హాజరయ్యారు. 12 మంది గైర్హాజరైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఎస్‌ఐ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

గ్రామాల్లో ఎంపీడీవో విస్తృత పర్యటన



చిలకలగెడ్డలో ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న ఎంపీడీవో కుమార్, తదితరులు

అనంతగిరి(అరకులోయటౌన్): మండలంలోని చిలకలగెడ్డ, కాశీపట్నం పంచాయతీలలో శనివారం ఎంపీడీవో ఎం.వి.వి.కుమార్ పర్యటించారు. చిలకలగెడ్డలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మిస్తున్న ఇంకుడు గుంతలను పరిశీలించారు. ఈ పనులు 3 రోజుల్లో పూర్తి చేయాలని ఉపాధి అధికారులకు సూచించారు. కాశీపట్నంలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో చేస్తున్న భూమి చదును పనులు, మస్టర్లు తనిఖీ చేశారు. ప్రతి రోజు రూ.300 వచ్చేలా పనులు చేయాలని కూలీలకు సూచించారు. రెండు పంచాయతీలలో సామాజిక ఫించన్ పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఉపాధి కూలీలకు పని ప్రదేశంలోనే ఫించన్‌లు అందజేయాలని సూచించారు. వెల్ఫేర్ అసిస్టెంట్ గీతా మీనన్ పాల్గొన్నారు.

పెరిగిన జరిమానాల నుంచి తప్పించుకోండి

కొయ్యూరు: ట్రాఫిక్ నిబంధనలు పాటించి పెరిగిన జరిమానాల నుంచి వాహనచోదకులు బయటపడాలని సీఐ వెంకటరమణ, కొయ్యూరు ఎస్‌ఐ కిషోర్‌వర్మ కోరారు. పోలీసు స్టేషన్‌లో శనివారం సాయంత్రం విలేకరులతో వారు మాట్లాడుతూ జరిమానాలు పదింతలు పెరిగాయన్నారు. వాటిని దృష్టిలో పెట్టుకుని వాహనదారులు బయటకు వెళ్లినప్పుడు విధిగా సీ బుక్, డ్రైవింగ్ లైసెన్స్, బీమా, హెల్మెట్ కలిగి ఉండాలన్నారు. లేకుంటే జరిమానాలు అధికంగా చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. లైసెన్స్ లేకుంటే రూ.5 వేలు, పొల్యూషన్ సర్టిఫికెట్ లేకుంటే రూ.1500, రిజిస్ట్రేషన్ లేకుంటే మొదట రూ.2 వేలు, రెండోసారి రూ.5 వేలు చెల్లించాలన్నారు. బైక్ రేసింగ్‌లకు పాల్పడితే రూ.10వేల వరకు జరిమానా విధిస్తామన్నారు. మైనర్ వాహనం నడిపితే రూ.10వేలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

పోలీసుల విధులపై అవగాహన



అడ్డతీగల పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌస్ నిర్వహిస్తున్న సీఐ నరసింహమూర్తి



జి.మాడుగుల స్టేషన్ ఆవరణలో ఆయుధాల పనితీరు, చట్టాలు వివరిస్తున్న పోలీసులు

జి.మాడుగుల: గిరిజన ప్రాంతాల్లో బాలికలు, మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన అవసరమని జి.మాడుగుల ఎస్‌ఐ షణ్ముఖరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కేజీబీవీ విద్యార్థినులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా రక్షణకు నిరంతరం పోలీస్ శాఖ పనిచేస్తుందని, శాంతి భద్రత పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. పాఠశాలలో విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన తప్పనిసరని చెప్పారు. పోలీస్ చట్టాలు, కేసులు, తుపాకుల పనితీరు, పోలీసుల విధుల గురించి ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్, పోలీస్ శాఖల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అడ్డతీగల: సీఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలో శనివారం అడ్డతీగల పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌస్ నిర్వహించారు. స్థానిక ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు సీఐ నరసింహమూర్తి పోలీస్ స్టేషన్ నిర్వహణ, పాటించే విధి విధానాల గురించి వివరించారు. పోలీస్ స్టేషన్‌లోని ఆయుధాలు, వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. దుశ్చర్తి ఎస్‌ఐ వెంకయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు పోలీసుల సేవలు తెలుసుకోవాలి

గంగవరం : విద్యార్థులు పోలీసుల సేవల గురించి తెలుసుకోవాలని స్థానిక ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలలో పోలీసులు శనివారం ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించి, పలు అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో పోలీసుల దినచర్య,రికార్డులు నిర్వహణ గురించి ఎస్‌ఐ వెంకటేష్ వివరించారు.లాకప్‌గదిని చూపించడంతో పాటు ఆయుధాల వినియోగం, ఇతర అంశాల గురించి తెలిపారు.

మోటార్ వాహన చట్టాలు కఠినతరం



అడ్డతీగలలో వాహన చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ నరసింహమూర్తి



చింతపల్లిలో అవగాహన కల్పిస్తున్న సీఐ వినోద్ బాబు, ఎస్సైలు వెంకటేశ్వరరావు, వెంకటరమణ



గూడెంకొత్తవీధిలో వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వరప్రసాద్



పెదబయలులో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రమణ



పాడేరులో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ దీనబంధు

అడ్డతీగల: మోటార్ వాహనాల చట్టాలు కఠినతరం చేసిన నేపథ్యంలో వాహనదారులు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని అడ్డతీగల సీఐ నరసింహమూర్తి అన్నారు. స్థానిక సీతపల్లి జంక్షన్‌లో ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు, విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మారిన నిబంధనలను అనుసరించి ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఇతర రికార్డులు అన్నీ వాహనాలతో పాటు కలిగి ఉండాలని సీఐ సూచించారు. 18 ఏళ్ళు నిండని వారికి వాహనాలు ఇవ్వకూడదన్నారు.

నిబంధనలు మీరితే భారీ జరిమానాలు

చింతపల్లి: మోటారు వాహన చట్టంలో నూతనంగా సవరణలు జరిగాయని, హైకోర్టు ఆదేశాలను పక్కాగా అమలు చేయనున్నట్టు చింతపల్లి సీఐ వినోద్‌బాబు తెలిపారు. శనివారం చింతపల్లిలో వాహన చోదకులకు మారిన చట్టం, నిబంధనలు జరిమానాలపై అవగాహన కల్పించారు. నిబంధనలు మీరి ఎవరైనా ప్రవర్తించి వాహనాలు నడిపితే వారినుంచి ఇకపై భారీ జరిమానాలు విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు వెంకటేశ్వరరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

గూడెంకొత్తవీధి: వాహన చోదకులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని గూడెం కొత్తవీధి సీఐ వరప్రసాద్ సూచించారు. శనివారం గూడెంకొత్తవీధిలో వాహన చోదకులకు మారిన చట్టం, నిబంధనలు, జరిమానాలపై అవగాహన కల్పించారు. నిబంధనలు మీరి ప్రవర్తిస్తే భారీ జరిమానాలు విధిస్తామన్నారు. వాహన చోదకులు పోలీసులకు సహకరించాలని కోరారు.

ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి

పెదబయలు: ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్థానిక ఎస్‌ఐ కె.రమణ అన్నారు. పెదబయలులో వాహనదారులకు అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్స్, సీ బుక్, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్, నంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలన్నారు.

కొత్త వాహన చట్టంపై అవగాహన

పాడేరు: వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని పాడేరు సీఐ దీనబంధు హెచ్చరించారు. కొత్త మోటారు వెహికల్ చట్టంపై శనివారం పాడేరు పట్టణంలో వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు. జీపులు, ఆటో సర్వీసులు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని మితిమీరిన వేగంతో వెళ్లి ప్రమాదాలకు కారణమైతే లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు.

గంగవరం: స్థానిక గంగవరం జంక్షన్‌లో కొత్తగా వాహన చట్టాలపై గంగవరం ఎస్‌ఐ వెంకటేష్ అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: మండలంలోని చాపరాయి వద్ద జాతీయ రహదారిలో వాహనదారులకు మోటారు వాహన చట్టాలపై కరపత్రాలను పంచుతూ పోలీసులు అవగాహన కల్పించారు. వాహన పత్రాలు తప్పక ఉండాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ కె.పాపినాయుడు హెచ్చరించారు.

రాజవొమ్మంగిలో మానవహారం



రాజవొమ్మంగిలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

రాజవొమ్మంగి: స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద జాతీయ రహదారిపై శనివారం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలంటూ విద్యార్థులు మానవహారంగా ఏర్పడి అవగాహన కల్పించారు. అనంతరం పోలీసుల విధులు బాధ్యతలు, వివిధ రక్షణ అంశాలపై విద్యార్థులకు సీఐ సన్యాసినాయుడు, ఎస్‌ఐ నరసింహమూర్తి, వివరించారు. మహిళల రక్షణకు తీసుకుంటున్న చర్యలు తెలియజేశారు.

మహిళా సాధికారత సాధించాలి



గూడెంకొత్తవీధిలో ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీదేవి, సిబ్బంది



దుంబ్రిగుడలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గూడెంకొత్తవీధి: మహిళలంతా సాధికారత సాధించాలని గూడెంకొత్తవీధి ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం గూడెంకొత్తవీధి ఐసీడీఎస్ ప్రాజెక్టు సిబ్బంది పలు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆడపిల్లల తల్లులతో మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రామలక్ష్మి, వలసమ్మ, కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు మండలంలోని ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ చేపట్టిన సైకిల్ ర్యాలీని సీడీపీవో నీలిమ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో సుందరరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్ మాట్లాడుతూ ఆడపిల్లల సంరక్షణకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయిని కె.కృష్ణకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారం రోజుల పాటు ఆయా కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నామని సీడీపీవో విజయకుమారి తెలిపారు. ఆమె శనివారం కంఠారం సెక్టార్‌కు సంబంధించి ఆడాకులలో కార్యకర్తకు సీమంతం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ డౌనూరు ఆరోగ్య కేంద్రంలో మహిళల కోసం ఫీడింగ్ కేంద్రం(తల్లులు పాలిచ్చే గది) ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సునీత, బాలామణి, మహాలక్ష్మి, డౌనూరు వైద్యులు లలిత, బీసీ శేఖర్ పాల్గొన్నారు.



ఆడాకులలో సీమంతం నిర్వహిస్తున్న సీడీపీవో విజయకుమారి

వృద్ధులకు రగ్గుల పంపిణీ



అల్లంగిపుట్టులో రగ్గులు పంపిణీ చేస్తున్న జిల్లా నాయకులు

పెదబయలు: గంపరాయి పంచాయతీ అల్లంగిపుట్టు గ్రామంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం పేద వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. 50 మందికి సొసైటీ జిల్లా శాఖ వైస్ చైర్మన్ ఎన్.గంగరాజు, ప్రధాన కార్యదర్శి జి.గౌరిశంకర్ వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో గంపరాయి గ్రామ పంచాయతీ శాఖ అధ్యక్షులు బొరగం అప్పారావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.జానకిరామ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిరికి సన్మానం



రవిప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం, తదితరులు

అరకులోయ టౌన్: వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన హుకుంపేట మండల మాజీ వైస్ ఎంపీపీ బత్తిరి రవిప్రసాద్‌కు శనివారం అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేను తన క్యాంప్ కార్యాలయంలో రవిప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ హుకుంపేట మండల అధ్యక్షుడు పాంగి అనిల్, అరకు నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు రేగం శివరామకృష్ణ, హుకుంపేట మేజర్ పంచాయతీ సర్పంచ్ సమిడ వెంకట పూర్ణిమ, నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షుడు బత్తిరి చరణ్ తేజ, హుకుంపేట మండల ముఖ్య నాయకులు రేగం ప్రవీణ్‌కుమార్, వి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.